
సాక్షి
పల్నాడు

ఆదివారం | 27 | ఏప్రిల్ | 2025



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 514.50 అడుగుల వద్ద ఉంది. ఇది 139.4380 టీఎంసీలకు సమానం.



రెడ్డి పేరంటాలమ్మకు పూజలు

నాదెండ్ల: సాతులూరులోని రెడ్డి పేరంటాలమ్మ ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. గత నెల 17న ఈ ఆలయాన్ని రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించి ప్రతిష్ట నిర్వహించారు.

ప్రిన్సిపల్ జడ్జిని కలిసిన కలెక్టర్



నరసరావుపేట: స్థానిక కోర్టు ప్రాంగణానికి శనివారం విచ్చేసిన గుంటూరు జిల్లా ప్రిన్సిపల్ జడ్జి సాయికల్యాణ చక్రవర్తిని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు మర్యాద పూర్వకంగా కలిశారు.

అందిన కార్పొరేట్ విద్య

- ఆయా పాఠశాలల్లో 25శాతం సీట్లు కేటాయింపు
- ఒకటి నుంచి 8వ తరగతి వరకు ఉచిత విద్య
- జిల్లాలో 371 ప్రైవేటు పాఠశాలలు
- రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ
- మే 15 తుది గడువు

పేద పిల్లలకు ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో ఉచిత ప్రవేశం



నరసరావుపేట ఈస్ట్: తమ పిల్లలను ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చేర్పించి చదివించాలనేది నిరుపేద, మధ్య తరగతి తల్లిదండ్రుల ఆశ. అందుకు వారి ఆర్థిక పరిస్థితి అనుకూలించదు. అయితే పేదల ఆశలకు విద్యాహక్కు చట్టం -2009 అండగా నిలుస్తోంది. ప్రతి ప్రైవేటు, కార్పొరేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఒకటో తరగతిలో పేదలకు కేటాయించాలని చట్టంలోని సెక్షన్ 12(1)(సీ) స్పష్టం చేస్తోంది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. పాఠశాల విద్యాశాఖాధికారులకు సైతం ఖచ్చితమైన ఆదేశాలు అందటంతో ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్ల భర్తీపై ప్రత్యేక దృష్టి సారించారు.

ప్రభుత్వమే ఫీజు చెల్లిస్తుంది

విద్యాహక్కు చట్ట ప్రకారం పేద పిల్లలకు 1వ తరగతిలో 25 శాతం సీట్లు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రైవేటు యాజమాన్యాల పాఠశాలలకు ఆదేశాలు జారీ చేయటంతోపాటు అవి అమలయ్యేలా చూడాలని విద్యాశాఖాధికారులను ఆదేశించింది. జిల్లాలో 371 ప్రైవేటు యాజమాన్యాలలో నడిచే పాఠశాలలు ఉన్నాయి. ఒక్కో పాఠశాలలో కనీస స్థాయిలో సీట్లు భర్తీ చేసినా దాదాపు 4వేల మంది పేద పిల్లలు లబ్ధి పొందుతారు. 1వ తరగతిలో ప్రవేశం పొందిన విద్యార్థికి 8వ తరగతి వరకు ఫీజులను ప్రభుత్వమే చెల్లిస్తుంది. ప్రైవేటు పాఠశాలలకు చెల్లించాల్సిన ఫీజులను నిర్ణయించేందుకు ప్రభుత్వం ఇప్పటికే కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ నివేదిక ఆధారంగా నిర్ణయించిన ఫీజును ప్రభుత్వం విద్యార్థులు ప్రవేశం పొందిన పాఠశాలలకు నేరుగా చెల్లిస్తుంది.

అర్హత వయస్సు

సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ, ఐబీ సిలబస్‌ను అనుసరిస్తున్న పాఠశాలల్లో ప్రవేశాలకు ఏప్రిల్ 2, 2019 నుంచి మార్చి 31, 2020 మధ్య జన్మించి 5 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి. అలాగే స్టేట్ సిలబస్ అనుసరిస్తున్న పాఠశాలల్లో ప్రవేశాలకు జూన్ 2, 2019 నుంచి మే 31, 2020 మధ్య జన్మించి 5 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి.

ఎంపిక విధానం

విద్యార్థుల ఎంపికను పారదర్శకంగా చేపట్టేలా పాఠశాల విద్యాశాఖ చర్యలు తీసుకుంటోంది. అర్హులైన పేదలు సీఎస్‌ఈ వెబ్‌పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయటం మొదలు ఎంపిక ప్రక్రియ, సీట్ల కేటాయింపు అంతా పారదర్శంగా కొనసాగుతుంది. దరఖాస్తులను www.cse.ap.gov.in వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అలాగే సమీపంలోని సచివాలయం, మండల విద్యాశాఖాధికారి కార్యాలయం, మీసేవా, ఇంటర్నెట్ సెంటర్ల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసేందుకు నివాస ధ్రువీకరణ, విద్యార్థి జనన ధ్రువీకరణ పత్రాలు, దివ్యాంగులైతే వైకల్యం సర్టిఫికెట్, హెచ్ఐవీ బాధితులైతే సంబంధిత మెడికల్ సర్టిఫికెట్, వార్షిక ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలు ఉండాలి. ఆయా ధ్రువీకరణ పత్రాల ఆధారంగా ప్రాధాన్యతా క్రమంలో పారదర్శకంగా ఎంపిక పూర్తి చేస్తారు. ఆధార్‌తో లింక్ చేయబడి దరఖాస్తులో పేర్కొన్న మొబైల్ ఫోన్‌కు ఎస్ఎంఎస్ ద్వారా ఎంపికైన విద్యార్థుల వివరాలు అందచేస్తారు. పట్టణ ప్రాంతాలలో రూ.1.44 లక్షలు, గ్రామీణ ప్రాంతాలలో రూ. 1.20 లక్షలు వార్షిక ఆదాయంగా నిర్ణయించారు. ఎంపికలో దరఖాస్తులో పొందుపరిచిన చిరునామా ఆధారంగా పాఠశాల సమీపంలోని విద్యార్థులకు మొదట సీట్లు కేటాయిస్తారు.

సీట్ల కేటాయింపు ఇలా...

ప్రైవేటు, కార్పొరేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 2025-26 విద్యాసంవత్సరానికి 1వ తరగతిలో 25 శాతం సీట్లు ప్రతి పాఠశాల కేటాయించాలి. ఇందులో 5 శాతం సీట్లు ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వర్గాలు (దివ్యాంగులు, అనాథలు, హెచ్ఐవీ బాధిత పిల్లలు)కు కేటాయించారు. మరో 10 శాతం ఎస్సీలకు, 4 శాతం ఎస్టీలకు, మిగిలిన 6 శాతం సీట్లు బలహీన వర్గాలకు చెందిన బీసీ, మైనారిటీ, ఓసీ (ఆదాయం ఆధారంగా) వర్గాలకు కేటాయించారు.

దరఖాస్తు గడువు

విద్యాహక్కు చట్టం-2009 ద్వారా 2025-26 విద్యా సంవత్సరానికి గాను ప్రైవేటు పాఠశాలల్లో చేరేందుకు ఈనెల 28వ తేదీ నుంచి మే 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. వచ్చిన దరఖాస్తులను ప్రాధాన్యతా క్రమంలో పరిశీలించి మే 24వ తేదీన మొదటి విడత ఫలితాలను ప్రకటించి ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రుల మొబైల్‌ఫోన్‌లకు సందేశం అందిస్తారు. తొలి విడత పాఠశాలల ప్రవేశాల నిర్ధారణను జూన్ 2వ తేదీ నాటికి పూర్తి చేస్తారు. రెండవ విడత ఫలితాలను జూన్ 6వ తేదీన ప్రకటించి పాఠశాలల్లో ప్రవేశాల నిర్ధారణను జూన్ 12వతేదీ నాటికి పూర్తి చేస్తారు. పేద విద్యార్థులకు విద్యాహక్కు చట్టం ద్వారా కేటాయించిన 25శాతం సీట్ల అవకాశాన్ని తల్లిదండ్రులు వినియోగించుకోవాలి జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు.

న్యూస్‌రీల్

ప్రత్యేక పీజీఆర్ఎస్‌లో 34 అర్జీలు స్వీకరణ



నరసరావుపేట: కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు అధ్యక్షత వహించిన కలెక్టర్ పి.అరుణ్‌బాబు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారిచే 34అర్జీలు స్వీకరించారు. సంబంధిత శాఖలకు ఆయా ఫిర్యాదులను అందజేసి సమస్యలను వెంటనే పరిష్కరించవలసిందిగా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో వెనుకబడినవర్గాల వారి సమస్యలకోసం ప్రత్యేకంగా చొరవ తీసుకొని ప్రతి నెల నాల్గవ శనివారం ప్రత్యేకంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. జాయింట్ కలెక్టర్ సూరజ్, అదనపు ఎస్పీ జేవీ సంతోష్, డీఆర్ఓ మురళి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

28, 29న డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కార్యక్రమం

నరసరావుపేట: తుఫాన్‌లు, వరదలు సంభవించిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై అవగాహన నిమిత్తం దాచేపల్లి మండలం రామాపురంలో ఈనెల 28న టేబుల్‌టాప్ ఎక్సర్‌సైజ్, 29న ఫిజికల్ మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు.

30న పాలిసెట్

గుంటూరు నగరంలో 11 పరీక్షా కేంద్రాలు

గుంటూరు ఎడ్యుకేషన్ : పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశం కోసం ఉద్దేశించిన పాలిసెట్-2025 ఈనెల 30న జరగనుంది. పాలిసెట్‌కు జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసిన 4,030 మంది విద్యార్థులకు గుంటూరు నగరంలో 11 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరగనుండగా, విద్యార్థులు కనీసం గంట ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంది. ఉదయం 11 గంటల తరువాత నిముషం ఆలస్యమైనా విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమని అధికారులు ప్రకటించారు.

అద్దంకమ్మ అమ్మవారి తిరునాళ్ల



ప్రత్తిపాడు: వట్టిచెరుకూరులో అద్దంకమ్మ అమ్మవారి తిరునాళ్ల ఉత్సవాలు నేత్ర పర్వంగా జరుగుతున్నాయి. ఈ నెల 23 నుంచి మొదలైన ఉత్సవాల్లో తొలి రోజు మారెమ్మ కొలుపు, మర్నాడు పోలేరమ్మ కొలుపులు నిర్వహించారు. శనివారం కుంకుమ బండ్లుతో ఊరేగింపు చేపట్టారు. తిరునాళ్ల సందర్భంగా అమ్మవారి దేవస్థానం విద్యుత్ దీపాలతో ధగధగలాడుతుంది. స్థానికులు ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

టీచర్లకు మెడికల్ సర్టిఫికెట్లు అందజేత

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో ఉపాధ్యాయుల బదిలీల కోసం వైద్య ధృవీకరణ ప్రక్రియ 24 నుంచి ప్రారంభమైంది. ఇందుకుగాను జీజీహెచ్ సిబ్బందితో మెడికల్ బోర్డు ఏర్పాటు చేసి లాజిస్టిక్స్ కమిటీ ద్వారా అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో దాదాపు 710 మంది టీచర్లకు వైద్య పరీక్షలు నిర్వహించగా శనివారం 200 మందికి వైద్య ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ చేతుల మీదుగా డీఈఓ కార్యాలయం వారికి అందజేశారు. జీజీహెచ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీల రాష్ట్ర సదస్సు

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్) : ఏపీ స్టేట్ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి అడ్మిన్ సెక్రటరీల సమావేశం గుంటూరు నగరంలోని ఏపీ ఎన్జీవో కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఓర్సు రామకృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశంలో అడ్మిన్ సెక్రటరీల సమస్యలు, పదోన్నతుల విషయంపై చర్చించనున్నారు.

డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు



నరసరావుపేటటౌన్: కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో రాష్ట్ర పోలీసులు అప్రమత్తం అయ్యారు. పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం వన్‌టౌన్, టూటౌన్ పోలీసులు రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, షాపింగ్‌మాల్స్, లాడ్జీల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పోలీస్ జాగిలాలతో కలిసి పరిసరాలంతా తిరిగి పరిశీలించారు. లాడ్జిల్లో బస చేసినవారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. షాపింగ్ మాల్, లాడ్జీల నిర్వాహకులతో మాట్లాడి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానస్పద వ్యక్తుల సంచారంపై పోలీస్ శాఖకు సమాచారం అందజేయాలని సీఐలు ఎం.వి.చరణ్, హైమారావు సూచించారు.

బుద్ధిష్ట్ సర్క్యూట్ వద్ద అగ్నిప్రమాదం



అమరావతి: అమరావతిలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బుద్ధ విగ్రహం ఎదురుగా కోట్లాది రూపాయలతో నిర్మించిన బుద్ధిష్ట్ సర్క్యూట్ భవనాల వద్ద శనివారం అగ్నిప్రమాద జరిగింది. పర్యాటక శాఖ మేనేజర్ మణికుమార్ అందించిన సమాచారం మేరకు ఓ ప్రైవేటు ఊరేగింపులో కాల్చిన బాణసంచా రవ్వలు బుద్ధిష్ట్ సర్క్యూట్ భవనాల సమీపంలో ఉన్న చెత్తలో పడి రాజుకుని మంటలు చెలరేగాయి. ఇది గమనించిన స్థానికులు మంటలు అర్పటానికి ప్రయత్నించినా సాధ్య పడలేదు. సత్తెనపల్లి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వటంతో అగ్నిమాపక వాహనం, సిబ్బంది చేరుకుని మంటలు అదుపులోకి తెచ్చారు. కోట్లాది రూపాయల భవనాలకు ఎటువంటి నష్టం జరగలేదు.

క్షతగాత్రులకు సత్వర సాయం

స్థానికులు, పోలీసులకు జిల్లా ఎస్పీ అభినందనలు



చికిత్స పొందుతున్న బస్సు డ్రైవర్



ఘటనాస్థలిని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నరసరావుపేట: ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా పడిన సంఘటనలో గాయాలైన వారిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించి వైద్యం చేయించిన పోలీసులను జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అభినందించారు. శనివారం తెల్లవారుజామున శ్రీలక్ష్మీ గాయత్రి ట్రావెల్ బస్సు 40 మంది ప్రయాణికులతో హైదరాబాదు నుంచి చీరాలకు వెళుతూ మార్గమధ్యలో నకరికల్లు మండలం శాంతినగర్ గ్రామంలోని పెట్రోల్ బంకు ఎదురుగా చేరుకునేసరికి బస్సు డ్రైవరుకు నిద్రమత్తు ఆవరించి బస్సు రోడ్డు పక్కన ఉన్న మార్జిన్‌లో పక్కకు పడిపోయింది. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించటంతో అక్కడకు చేరుకున్న పోలీసులు, స్థానికులు బస్సు లోపల వారందరినీ బయటకు తీశారు. ఈ సంఘటనలో 15 మందికిపైగా గాయాలు కావటంతో వారిని చికిత్స నిమిత్తం అంబులెన్సుల ద్వారా పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటళ్లకు చేర్చారు. ఈసంఘటనలో ఓ మహిళ బస్‌లోపల కింది భాగంలో ఇరుక్కుని పోగా, పొక్లయిన్, క్రేన్ల సహాయంతో బయటకు తీసి అంబులెన్స్ ద్వారా హాస్పిటల్‌కు పంపించారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు, డీఎస్పీ కె.నాగేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన గోల్డెన్ అవర్ లోపల క్షతగాత్రులను రక్షించి హాస్పిటల్‌కు పంపినందుకు స్థానికులు, పోలీసులకు ప్రత్యేకంగా అభినందించారు. నరసరావుపేట రూరల్ సీఐ రామకృష్ణ, రూరల్ ఎస్ఐ కిషోర్, నకరికల్లు ఎస్ఐ సురేష్ బాబు, పోలీస్ సిబ్బంది సహాయ సహకారాలు అందజేశారు.

ప్రధాని పర్యటన విజయవంతం చేద్దాం

ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి నాదెండ్ల, కలెక్టర్



ప్రధాని మోదీ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

తాడికొండ: అమరావతి రాజధాని నిర్మాణ పనులను పునఃప్రారంభించేందుకు భారత ప్రధాని నరేంద్ర మోదీ మే 2వ తేదీన అమరావతి రానున్న నేపథ్యంలో అక్కడి ఏర్పాట్లను శనివారం రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ప్రధాని పర్యటన ఏర్పాట్ల పర్యవేక్షణ నోడల్ అధికారి వీరపాండియన్, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, ఆర్డీఓ కె. శ్రీనివాసరావులు పరిశీలించి అధికారులకు సూచనలు, సలహాలు అందించారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనకు సుమారు 4 నుంచి 5 లక్షల మంది ప్రజలు ఆరు జిల్లాల నుంచి తరలివస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా భావిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సభకు సీఆర్డీఏ పరిధిలోని 120 ఎకరాలు కేటాయించుకుని ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు 75 శాతం పనులు పూర్తి అయ్యాయని, 29వ తేదీ నుంచి ఎస్పీజీ సిబ్బంది వచ్చిన తరువాత వారి ఆధ్వర్యంలో మిగిలిన ఏర్పాట్లు పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. వాహనాల రాకపోకలకు నాలుగు ప్రధాన రహదారులు వున్నాయని, హైవే నుంచి వచ్చే వాహనాలకు సీడ్ యాక్సెస్ రోడ్డు, అలాగే వెస్టన్ బైపాస్ రోడ్డును కూడా ఉపయోగించుకోవాలని సూచించారు. కృష్ణ, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి ఎక్కువ మంది వస్తారన్నారు. తాగునీరు, ఆహారం, మరుగుదొడ్లు వంటి వసతులు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

'ఉపాధి' రూ.300 అందేలా చర్యలు

జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు

నరసరావుపేట: జిల్లాలో ఉపాధి హామీ శ్రామికుల సగటు వేతనం రోజుకు రూ.300పైనే ఉండేలా పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఉపాధి హామీ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రోజుకు 90వేల శ్రామికులకు ఉపాధి కల్పించడం లక్ష్యంగా నిర్దేశించగా సగటున 50 శాతం మంది మాత్రమే ఉపాధి పొందుతున్నారన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, ఏపీఎంలు ఉపాధి కల్పనలో రోజువారీ లక్ష్యాలను చేరుకునేలా కృషిచేయాలన్నారు. జిల్లాకు మంజూరైన 6500 ఫారం పాండ్లకు గానూ 2,200 ఫారం పాండ్ల నిర్మాణానికి అనుమతులు పొందాల్సిఉందన్నారు. డీఆర్ఓ మురళి, డీఎఫ్ఓ కృష్ణప్రియ, డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి, డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీరాణి, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ప్రధాని సభకు 600 బస్సులు

అమరావతి రాజధాని పునఃనిర్మాణ కార్యక్రమంలో పాల్గొనే ప్రధానమంత్రి నరేంద్రమోదీ సభకు జిల్లా నుంచి 600 బస్సుల్లో ప్రజలను చేరవేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుంచి జిల్లా, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సూచనలు, సలహాలు అందజేశారు. మరో 100 బస్సులను సిద్ధంగా ఉంచాలని సూచించారు. అవసరమైన మంచినీరు, అల్పాహారం, భోజనం వసతులు ఏర్పాటు చేయాలన్నారు. సభాస్థలి వద్ద పంచాయతీ రాజ్‌శాఖ సిబ్బందిని ఏర్పాటుచేసి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వీటన్నిటికీ జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు.. దీనికి సంబంధించి రూట్ మ్యాప్ ఆర్అండ్‌బీ శాఖ ఈఈ రాజా నాయక్ నిర్వహిస్తారన్నారు. కలెక్టరేట్‌లో ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

జీవిత భాగస్వామి పింఛన్ దరఖాస్తులు ఆమోదించండి

నరసరావుపేట: జీవిత భాగస్వామి పింఛను బదిలీ కోసం అందిన 3900 దరఖాస్తులను శనివారంతో ఆమోదించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందిని ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో పింఛను పంపిణీ ఫీడ్ బ్యాక్ సర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పంపిణీపై నేరుగా లబ్ధిదారుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవడం జరుగుతోందన్నారు. లబ్ధిదారులతో ప్రవర్తించే విధానం, పంపిణీలో అక్రమాలు, ఇంటి వద్దే పంపిణీ వంటి అంశాలపై ఫీడ్ బ్యాక్ స్వీకరిస్తున్నామన్నారు. పదే పదే నెగెటివ్ ఫీడ్ బ్యాక్ అందిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. డీఆర్డీఏ పీడీ ఝాన్సీ రాణి, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి వెంకటరెడ్డి, డీఎల్డీఓ గబ్రు నాయక్, రాజగోపాల్ పాల్గొన్నారు.

పాకిస్తానీయులు దేశం విడిచి వెళ్లాలి

నరసరావుపేట: కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర హోంమంత్రిత్వశాఖ అన్ని రాష్ట్రాలకు ఇచ్చిన ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న పాకిస్తాన్ దేశీయులు ఈనెలాఖరు కల్లా దేశాన్ని వీడి వెళ్లాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా పరిధిలో ఉన్న పాకిస్తాన్ వాసులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ డివిజనల్ అధికారులను ఆదేశించారు. వారి వీసాలను రద్దు చేసినందున సాధారణ వీసాలపై వచ్చిన వారు ఆదివారం నాటికి, వైద్య వీసాలపై వచ్చినవారు మంగళవారం కల్లా దేశం విడిచి వెళ్లాలని స్పష్టం చేశారు. ఈ నెల 30 తర్వాత అట్టారీ సరిహద్దును మూసివేస్తున్న దృష్ట్యా జిల్లాలో పాకిస్తాన్ వీసాపై వచ్చిన వారిని గుర్తించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓలను కలెక్టర్ ఆదేశించారు.

గిట్టుబాటు లేని సేద్యం



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు ఆళ్ల వెంకటేశ్వర్లు. ముప్పాళ్ల మండలంలోని చాగంటివారి పాలెం గ్రామానికి చెందిన కౌలు రైతు ఈయన. గత ఏడాది ముప్పాతిక ఎకరం కౌలుకు తీసుకొని పసుపు పంట సాగు చేశాడు. సుమారు రూ.30వేల వరకు ఆదాయం వచ్చింది. ఈ ఏడాది అదే పొలంలో మరలా పసుపు సాగు చేశాడు. విత్తన కొమ్ము పుట్టి రూ.7,500 చొప్పున కొనుగోలు చేశాడు. సాగు వ్యయం గత ఏడాది కంటే రూ.25వేలు పెరిగింది. తీరా పంట వేశాక కాలువలకు నీరు రావటంతో పాటుగా, వర్షాలు ఎక్కువగా ఉండటంతో నేలలోని తేమ శాతం అధికంగా ఉండి నేలపుచ్చు వచ్చి దిగుబడి తగ్గింది. గత ఏడాది క్వింటా రూ.13,300కి చేలోనే కొనుగోలు చేయగా, ఈ ఏడాది రూ.11వేలకు మాత్రమే అడుగుతున్నారని పెట్టుబడి కూడా వస్తుందో లేదో అని దిగులు పడుతున్నాడు.

ధర లేక పసుపు రైతు విలవిల

- పెరిగిన సాగు వ్యయం.. తగ్గిన దిగుబడులు
- లభించని గిట్టుబాటు ధర
- మార్క్‌ఫెడ్ ద్వారా కొనేందుకు ముందుకురాని ప్రభుత్వం
- పెట్టుబడి కూడా వచ్చేలా లేదని రైతుల ఆందోళన



చాగంటివారిపాలెంలో కల్లంలో ఆరబోసిన పసుపు కొమ్ములు

ముప్పాళ్ల: కూటమి ప్రభుత్వం రైతులపై చిన్నచూపు చూస్తోంది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు మద్దతు ధర కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తుండటంతో ఈ ఏడాది సాగు చేసిన రైతులు నష్టపోయే పరిస్థితి దాపురించింది. ప్రధానంగా వాణిజ్య పంటలు సాగు చేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

ఈ ఏడాది పసుపు పంట సాగు చేసిన రైతులు కనీసం పెట్టుబడి కూడా వస్తుందో రాదో అనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెగుళ్ల బారినుంచి పంటను కాపాడుకొని పంట దిగుబడులు చేతికందే సమయానికి ధరలు ఒక్కసారిగా పడిపోవటంతో రైతు కుదేలవుతున్నాడు. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాల్సిన ప్రభుత్వం పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో రైతుల్లో ఆందోళన మరింతగా పెరిగింది.

200 హెక్టార్లలో సాగు

సబ్‌డివిజన్ పరిధిలో ఈ ఏడాది సుమారు 200 హెక్టార్లలో పసుపు పంట సాగు చేశారు. అధికంగా ముప్పాళ్ల మండలంలోనే సాగవుతోంది. ఎకరాకు రు.లక్ష పైనే రైతులు పెట్టుబడి పెట్టారు. విత్తనం కొనుగోలు సమయంలో పుట్టి రు.7,500 నుంచి రూ.8 వేలు చొప్పున కొనుగోలు చేశారు. ఎకరాకు రు.50వేల వరకు విత్తనం కొమ్ముకు ఖర్చుచేశారు. కూలీ ధర కూడా పెరిగింది. సాగర్ ఆయకట్టుకు నీటి విడుదల కావటంతో పాటుగా వర్షాలు అధికంగా ఉండటంతో కొమ్ముకు భూమి పుచ్చు ఏర్పడి దిగుబడి పైన ప్రభావం చూపింది. తెగుళ్ల నుంచి పంటలను కాపాడుకునేందుకు అధికంగా పురుగు మందులకు ఖర్చు చేయాల్సి వచ్చింది. అన్ని కలిపితే ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.1.10లక్షల వరకు పెట్టుబడి పెట్టాల్సి వచ్చిందని రైతులు చెబుతున్నారు. గత ఏడాది పంట చేతికందే సమయానికే క్వింటా రూ.13,300 చొప్పున కల్లంలోనే కొనుగోలు చేశారు. ఈ ఏడాది కొమ్ము ఆరలేదంటూ రూ.10,500 నుంచి బేరం జరుపుతున్నారని రైతులు వాపోతున్నారు.

ఇప్పుడిచ్చే ధర పెట్టుబడికే చాలదు

ఎకరం రు.15వేలు ముందస్తు కౌలుతో ముప్పాతిక ఎకరంలో పసుపు పంట సాగు చేశా. ఇప్పటికి రు.లక్ష వరకు పెట్టుబడి అయింది. మొత్తం 20 క్వింటాళ్లు దిగుబడి వచ్చింది. పంట చేతికంది, అమ్ముకునే సమయానికి క్వింటా రూ.11వేలకు అడుగుతున్నారు. పైగా ఎండబెట్టాలని చెబుతున్నారు. రైతులంటే అందరికీ చులకనే. గత ఏడాది పచ్చి సరుకే రూ.13,300 కొనుక్కోని పోయారు. ఇప్పుడిచ్చే ధరతో పెట్టిన పెట్టుబడికి సరిపోదు.

– ఆళ్ల వెంకటేశ్వర్లు, చాగంటివారిపాలెం

దళారుల ఇష్టారాజ్యమైంది



ఎకరం పొలంలో పసుపు సాగు చేశా. ఇప్పటికి కౌలు, కూలీలు, ఎరువులు, పురుగు మందులకు రూ.1.10లక్షలు పెట్టుబడి పెట్టా. ఇవి కాకుండా విత్తనం కొమ్ము కొనుగోలుకు రూ.60వేలు ఖర్చు చేయాల్సి వచ్చింది. దిగుబడి చూస్తే 20 నుంచి 25 క్వింటాళ్ల వరకే వచ్చేలా ఉంది. నిజామాబాద్ మార్కెట్‌లో క్వింటా రూ.14వేల వరకు ధర ఉందని బంధువులు చెప్పారు. ఇక్కడేమో రూ.10వేలకు అడుగుతున్నారు. దళారుల ఇష్టారాజ్యంగా మారింది. ప్రభుత్వమే కొనుగోలు చేస్తే బాగుంటుంది.

– పసుపులేటి వీరాంజనేయులు, చాగంటివారిపాలెం

క్లుప్తంగా

అలరించిన 'మహా మంజీరనాదం'



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో అన్నమయ్య కళావేదికపై శ్రీసాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో 15వ అంతర్జాతీయ నృత్య దినోత్సవంలో భాగంగా మహామంజీర నాదం–2025 శనివారం కొనసాగాయి. పాలక మండలి సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేయగా, సంస్థ అధ్యక్షుడు డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. అనంతరం సుమంగళ ప్రభు (కర్ణాటక) భరతనాట్యం, దేబ్‌జనిబసు (కలకత్తా) కథక్, జెపీ కనిష్క (హైదరాబాద్), కూచిపూడి నృత్యం సభికులను అలరించాయి. కళాకారులను సంస్థ కార్యదర్శి డాక్టర్ కాజ వెంకటసుబ్రహ్మణ్యం కళాకారులను యువ కళారత్న పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమంలో వీవీఐటీ విశ్వ విద్యాలయం చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రముఖ ఆడిటర్ రామరాజు శ్రీనివాసరావు, పచ్చల నాగమహిత, వెంకటగిరి నాగలక్ష్మి పాల్గొన్నారు.

కంటైనర్‌ను ఢీకొన్న లారీ



మేదరమెట్ల: ఆగి ఉన్న కంటైనర్‌ను లారీ ఢీకొన్న సంఘటన 16వ నెంబరు జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. ఒంగోలు వైపు నుంచి గుంటూరు వైపు వెళుతున్న లారీ కొరిశపాడు మండల పరిధిలోని వెంకటాపురం జంక్షన్ వద్దకు రాగానే ముందు టైరు పగిలిపోవడంతో అదుపు తప్పి డివైడర్ ఎక్కింది. తరువాత ఒంగోలు వైపు వెళ్లే రహదారి పక్కన ఆగిఉన్న కంటైనర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ కాలు విరిగింది. ప్రమాదం జరిగిన సమయంలో లారీలో మరో ముగ్గురు ఉన్నారు. వీరికి ఎలాంటి గాయాలు కాలేదు. గాయపడిన డ్రైవర్‌ను హైవే అంబులెన్స్‌లో అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మేదరమెట్ల పోలీసులు తెలిపారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

జిల్లా ఖజానాధికారి కె శ్రీనివాసరావు



మాట్లాడుతున్న జిల్లా ఖజానాధికారి

మాచర్ల రూరల్: సమస్యల పరిష్కారానికి ట్రెజరీ శాఖ పెన్షనర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహిస్తామని జిల్లా ఖజానా శాఖాధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో రిటైర్డ్ ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షనర్స్‌కు, కుటుంబ సభ్యులకు అనేక సమస్యలున్నాయని, వారు ప్రతిసారీ కార్యాలయానికి రావటానికి ఇబ్బంది పడుతున్న విషయాన్ని తాము గుర్తించామని, వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తమ సబ్ ట్రెజరీ అధికారి పెన్షనర్స్ దగ్గరకు వచ్చి సమావేశం నిర్వహించి అక్కడికక్కడే సమస్యలు పరిష్కరించేలా తాము కృషి చేస్తామన్నారు. పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గాదె రామకృష్ణారావు మాట్లాడుతూ కుటుంబ పెన్షనర్లు క్వాంటం ఆఫ్ పెన్షన్ అమలులో జరుగుతున్న రికవరీ గురించి ఆందోళన చెందుతున్నారని, వాటిని సానుకూలంగా పరిష్కరించాలన్నారు. స్థానిక అసోసియేషన్ అధ్యక్షులు నందా నరసింహయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రామనాథశర్మ, సబ్ ట్రెజరర్ అధికారి రామా నాయక్, పెన్షనర్స్ సంఘ నాయకులు గాలిబ్, కోటయ్య, నాసరయ్య, చంద్రయ్య, గౌస్ మొహిద్దిన్, రఘుపతిరావు, అంజయ్య, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

న్యాయస్థాన భవనాలను సందర్శించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి



ప్రధాన న్యాయమూర్తి సాయి కల్యాణ చక్రవర్తికి పూల మొక్క అందజేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేటటౌన్: న్యాయస్థాన భవనాలను గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కల్యాణ చక్రవర్తి శనివారం సందర్శించారు. ఆయన కోర్టు సముదాయంలో గల భవనాలను ఆర్ అండ్ బీ అధికారులతో కలిసి పరిశీలించారు. అవసరమైన మరమ్మతులు తక్షణమే చేయాలని వారికి సూచించారు. న్యాయవాద సంఘ కార్యాలయాన్ని సందర్శించారు. అక్కడ ఉన్న న్యాయవాదులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆయనను స్థానిక 13వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎస్.సత్యశ్రీ, న్యాయమూర్తులు కె.మధుస్వామి, ఎం.గాయత్రిలు ఆహ్వానం పలికారు. పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావులు జిల్లా ప్రధాన న్యాయమూర్తిని మర్యాద పూర్వకంగా కలిశారు.

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలి

జిల్లా విద్యుత్ పర్యవేక్షక ఇంజినీర్ డాక్టర్ ప్రత్తిపాటి విజయ్‌కుమార్



రొంపిచర్ల: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించాలని జిల్లా విద్యుత్ పర్యవేక్షక ఇంజినీర్ డాక్టర్ ప్రత్తిపాటి విజయ్‌కుమార్ అన్నారు. రొంపిచర్ల సెక్షన్ పరిధిలోగల వి.రెడ్డిపాలెం 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శనివారం జిల్లా విద్యుత్ పర్యవేక్షక ఇంజినీర్ డాక్టర్ ప్రత్తిపాటి విజయ్‌కుమార్ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ నూరు శాతం విద్యుత్ రెవెన్యూ వసూలు చేయాలన్నారు. ప్రతి నెలా రెండో శనివారం లైన్ మెయింటెనెన్స్ చేయాలన్నారు. నూతన సర్వీసులను వెంటనే మంజూరు చేయాలన్నారు. 50శాతం రాయితీతో అదనపు లోడ్ క్రమబద్ధీకరించుకొనుటకు జూన్ 30 వరకు అవకాశం ఉందన్నారు. దీనిపై వినియోగదారులకు అవగాహన కలిగించాలన్నారు. అదనపు లోడ్‌ను వినియోగదారులు రెగ్యులరైజ్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో నరసరావుపేట రూరల్ డీఈఈ బి.వెంకటేశ్వరరెడ్డి, మండల ఏఈఈ కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కళాంజలి నాటకోత్సవాలు



చీరాల అర్బన్: చీరాల కళాంజలి ఆధ్వర్యంలో ఐదురోజులు పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల జాతీయ నాటకోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. స్థానిక కస్తూరిబా గాంధీ మున్సిపల్ గరల్స్ హైస్కూల్ ఆవరణలో ప్రదర్శనలు నిర్వహించారు. శనివారం రాత్రి డాక్టర్ రాయని హనుమంతరావు కళావేదికపై విజయవాడకు చెందిన త్రిధారా ది ఆర్ట్స్ ల్యాండ్స్ వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన, శ్రీరామ పట్టాభిషేకం నృత్య రూపకం ప్రదర్శించారు. చిన్నారులచే ప్రదర్శించిన నృత్య ప్రదర్శన అందరిని అలరించింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కార గ్రహీత వడలి రాధాకృష్ణకు సత్కారం నిర్వహించారు. అలానే సహృదయ, ద్రోణాదుల వారిచే వర్క్ ఫ్రం హోమ్ హాస్యనాటికను ప్రదర్శించారు. నాటికకు రచన అద్దేపల్లి భరత్‌కుమార్, దర్శకత్వం డి.మహేంద్ర వ్యవహించారు. కార్యక్రమానికి ప్రేక్షకులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఐదు రోజులు పాటు ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన పలు సంస్థలు వారిచే నాటిక పోటీలను నిర్వహిస్తున్నట్లు కళాంజలి అధ్యక్ష, కార్యదర్శులు కోడూరి ఏకాంబరేశ్వరబాబు, సాంబశివరావులు తెలిపారు.

దాడికి బాధ్యులపై చర్యలు తీసుకోండి

ఎస్సీ, ఎస్టీల గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కోరిన బాధితులు



మీడియాతో మాట్లాడుతున్న కేఎన్‌పీఎస్ నాయకుడు శ్రీనివాసరావు

నరసరావుపేట: శావల్యాపురం మండలం గంటావారిపాలెం గ్రామంలో టీడీపీ కూటమి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతుందని కుల నిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్) రాష్ట్ర కమిటీ సభ్యులు ఓర్సు శ్రీనివాసరావు ఆరోపించారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఎస్సీ, ఎస్టీల ప్రత్యేక గ్రీవెన్స్‌కు గంటావారిపాలెం బాధితులతో హాజరై వారికి జరిగిన అన్యాయంపై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. బాధితులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ ఈనెల 19వ తేదీన గ్రామంలోని ఎరుకలవాడలో కుంభా యోగయ్య రూ.16 లక్షలతో నిర్మించుకున్న చికెన్, కిరాణా షాపులను ఆ గ్రామ పెత్తందారులు కొనకంచి వెంకట్రావు, మురళి, మాదినేని మధుసూదనరావు, గోపు రామకృష్ణ, రావి హరివెంకట నరసింహారావులు పొక్లెయిన్‌తో కూల్చివేశారన్నారు. దీనికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదుచేసి నిందితులను అరెస్టు చేసి బాధితులకు రక్షణ కల్పించాల్సిన శావల్యాపురం ఎస్ఐ ఆ పనిచేయకపోగా బాధితులు ఎస్టీలు కాదని, బీసీలని ఉద్దేశపూర్వకంగానే తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రీవెన్స్‌లో బాధితులు తమకు మండల తహసీల్దారు గతంలో ఇచ్చిన కుల ధృవీకరణ సర్టిఫికెట్లను అందజేశారన్నారు. ఇప్పటికైనా కలెక్టర్, ఎస్పీ స్పందించి ఎరుకల కులస్తుల షాపులను కూల్చి వారిని కులం పేరుతో దూషించి దాడి చేసిన వారిపై అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసేందుకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అంతేగాకుండా వారిని వెంటనే అరెస్టు చేసి, బాధితులకు రక్షణ కల్పించడంతోపాటు రూ.18లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కేఎన్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గొల్లపూడి చిన్నప్రసాద్, సహాయ కార్యదర్శి జక్కా బ్రహ్మయ్య, చలంచర్ల అంజి, హనుమంతరావు, కుంభా హనుమంతరావు, సుజాత బాధితులు ఉన్నారు.

హోరాహోరీగా అండర్-17 బాలుర వాలీబాల్ పోటీలు



వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

సత్తెనపల్లి: పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ 54వ హైదరాబాద్ రీజియన్ స్థాయి అండర్–17 బాలుర వాలీబాల్ పోటీలు శనివారం హోరాహోరీగా ప్రారంభమయ్యాయి. పల్నాడు జిల్లా సత్తెనపల్లి (రామకృష్ణాపురం)లోని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ ఆవరణలో అండర్ –17 బాలుర వాలీబాల్ పోటీలు లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహించారు. పోటీల్లో క్రీడాకారులు నువ్వా .. నేనా అన్నట్లు తలపడ్డారు. పోటీలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం 18 జట్లు హాజరయ్యాయి. శనివారం రాత్రి ఫ్లడ్‌లైట్ల వెలుగులో కూడా పోటీలు కొనసాగించారు. ఎనిమిది జట్లు ఖమ్మం, సత్తెనపల్లి, హకీంపేట్, విజయవాడ-1, తెనాలి, వెంకటగిరి, వాల్తేరు, కర్నూల్ జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాయి. ఆదివారం క్వార్టర్ ఫైనల్, సెమీఫైనల్, ఫైనల్ పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటించనున్నారు. అనంతరం విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం చేపడుతామని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ సత్తెనపల్లి ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ బి.కిరణ్‌రెడ్డి తెలిపారు. పంజాబ్‌లో జరిగే జాతీయస్థాయి వాలీబాల్ జట్టును కూడా ఇక్కడ ఎంపిక చేయనున్నారు. వాలీబాల్ పోటీలను వీక్షించేందుకు క్రీడాకారులు, క్రీడాభిమానులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కార్యక్రమంలో రిఫరీలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠగా ఎడ్ల బండలాగుడు పోటీలు



పోటీల్లో బండలాగుతున్న ఎడ్ల జత

దాచేపల్లి: దాచేపల్లిలోని శ్రీ వీర్ల అంకమ్మతల్లి ఆలయ తిరునాళ్ల సందర్భంగా రాష్ట్ర స్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు శనివారం హోరాహోరీగా సాగాయి. పాలపళ్ల విభాగంలో పల్నాడు జిల్లా అమరావతి మండలం జిడుగు గ్రామానికి చెందిన బీఎస్ఆర్ బుల్ భూపతి శ్రీనివాస్, నూసాయిపేటకి చెందిన గౌరు కార్తీకేయ సంయుక్త ఎడ్ల జత 4,250 అడుగుల దూరం బండ లాగి విజేతగా నిలిచాయి. పల్నాడు జిల్లా మాచవరం మండలం మోర్జంపాడుకు చెందిన కుర్రి గంగరాజు యాదవ్ ఎడ్ల జత 3,609 అడుగుల దూరం బండలాగి రెండో స్థానం, ఫిరంగిపురం మండలం కండ్రిక గ్రామానికి చెందిన కేలం పద్మనాయుడు ఎడ్లజత 3,580 అడుగుల దూరం బండలాగి మూడోస్థానం, బాపట్ల మండలం పాండురంగాపురానికి చెందిన కె. ఏడుకొండలురెడ్డి ఎడ్లజత 3,500 అడుగుల దూరం బండలాగి నాల్గవ స్థానం, ముప్పాళ్ల మండలం మాదల గ్రామానికి చెందిన యర్రంశెట్టి సుబ్బారావు ఎడ్ల జత 3,369 అడుగుల దూరం బండలాగి ఐదవస్థానం, దాచేపల్లికి చెందిన యామర్తి శైలేంద్ర ఎడ్లజత 3,103 అడుగుల దూరం బండలాగి ఆరవ స్థానం, సూర్యాపేటకి చెందిన సురేష్, మాచవరం మండలం మల్లవోలుకి చెందిన దొప్పలపూడి మహిమ మణిరత్నం సంయుక్త ఎడ్లజత 2,800 అడుగుల దూరం బండలాగి ఏడవ స్థానంలో నిలిచాయి. విజేతలకు వరుసగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ. 8 వేలు, రూ.7 వేలు, రూ.5 వేలు, రూ. 3వేలు చొప్పున నగదు, షీల్డ్స్‌ని బహూకరించారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతగా గూడా శ్రీనివాసరావు వ్యవహరించారు. కమిటీ సభ్యులు కొప్పుల గిరి, అనిశెట్టి శ్రీనివాసరావు, యలమల నరేష్ తదితరులు పోటీలు పర్యవేక్షించారు.

మద్యం తాగి విద్యుత్ శాఖ అధికారి హల్‌చల్



మూల్పూరు గ్రామంలో మద్యం తాగి హల్‌చల్ చేస్తున్న విద్యుత్ శాఖాధికారి

అమర్తలూరు(వేమూరు): విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీరు మద్యం తాగి హల్‌చల్ చేసిన తీరు సామాజిక మాధ్యమాలలో వైరల్ మారింది. అమర్తలూరు మండలం విద్యుత్ కార్యాలయం అసిస్టెంట్ ఇంజినీరుగా నాంచారయ్య పని చేస్తున్నారు. మూల్పూరు గ్రామంలో ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో మద్యం తాగి వ్యక్తులపై ఇష్టారాజ్యంగా మాట్లాడుతూ ప్రవర్తించిన దృశ్య రూపం ద్వారా బయటకు వచ్చింది. విద్యుత్ శాఖలో పనిచేసే సిబ్బంది 24 గంటలు విధులు నిర్వహించాల్సి ఉంది. విధుల్లో ఉన్న విద్యుత్ శాఖాధికారి ప్రవర్తన తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. ఈ వీడియో జిల్లా ఉన్నతాధికారులు దృష్టికి చేరినట్లు సమాచారం.